క్లుప్తంగా

రాయితీపై విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందజేస్తున్న కోటేశ్వరరావు

మునగపాక: తోటాడ ఆర్‌బీకేలో శుక్రవారం రైతులకు సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్‌బీకేల ద్వారా మెరుగైన సేవలందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి


మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్పించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు.శుక్రవారం వాడ్రాపల్లి సచివాలయంలో ఉద్యోగులు,గ్రామపెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

31న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్ప్రెసెస్ డిగ్రీ కాలేజీలో ఈనెల 31 ఎంఎస్ఎన్ ల్యాబ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వమించనున్నారు. 2021, 2022, 2023 సంవత్సరాలలో బీఎస్సీ పూర్తి చేసి, కెమిస్ట్రీ ఓ సబ్జెక్టుగా ఉన్నవారు అర్హులు, ఆసక్తి గల విద్యార్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలి. ఎంపిక ప్రక్రియలో ముందుగా రాత పరీక్ష, తదుపరి ఇంటర్వ్యూ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు.

ఉపాధిహామీ పథకానికి కేంద్రం తూట్లు


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు

మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. మునగపాకలో శుక్రవారం కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 29న అనకాపల్లిలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందించడం లేదన్నారు. రానున్న రోజుల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నేత ఎస్.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు యలమంచిలి మండల సమావేశం

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

31న మునగపాకలో..

మునగపాక: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 31న నిర్వహించనున్నట్టు మునగపాక ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు టి.జగ్గంపేటలో హౌసింగ్ డే

కోటవురట్ల: టి.జగ్గంపేట గ్రామంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఉదయశ్రీ పాల్గొని లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆదుకుంటున్న ఆయిల్‌పామ్

కోటవురట్ల: ఆయిల్‌పామ్ పంట రైతును ఆదుకుంటోంది. ధరలో హెచ్చుతగ్గులున్నప్పటికీ ప్రతి నెలా ఫలసాయం రావడంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. స్థిరమైన ఆదాయంతో కుటుంబ అవసరాలు పోగా పిల్లల చదువుకు ఉపయోగపడుతోంది. దీంతో పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. జిల్లాలో సుమారు 3,800 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగులో ఉండగా పాయకరావుపేట నియోజకవర్గంలో 695 హెక్టార్లలో సాగవుతోంది. పాయకరావుపేట మండలం 105 హెక్టార్లు, నక్కపల్లి మండలం 20, ఎస్.రాయవరం మండలం 140, కోటవురట్ల మండలంలో 430 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు ఉన్నాయి. ఎగుమతికి సంబంధించి రైతులకు ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. కోటవురట్ల మండలంలో కోటవురట్ల, చినబొడ్డేపల్లి గ్రామాల్లో గెలలను కొనుగోలు చేస్తున్నారు.

గత మూడు నెలల్లో ధర ఇలా..

ఆయిల్‌పామ్ ధర గత మూడు నెలలుగా స్వల్పంగా పెరుగుతూ కాస్త ఊరట కలిగిస్తోంది. ఫిబ్రవరిలో టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ.13,539 ఉండగా, మార్చిలో రూ.13,796, ఏప్రిల్‌లో రూ.13,869 ఉంది. ధర పెరుగుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధర పతనమైనప్పుడు ప్రభుత్వంతో పాటు పలు కంపెనీలు అదనపు ధరను మద్దతుగా అందిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నాయి. టన్నుకు రూ.300 చొప్పున కంపెనీ అదనంగా రైతుకు చెల్లిస్తుండగా ఉద్యానవన శాఖ ద్వారా రూ.500 ప్రభుత్వం అందిస్తోంది. దీని ద్వారా మద్దతు ధరకు అదనంగా రూ.800 చేకూరుతుంది. ఇది కాకుండా సాగు ఖర్చు పెరగడంతో సాగు ఖర్చు కింద అదనంగా మరో రూ.500 ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది. ఇది అమలైతే ఆయిల్‌పామ్ రైతుకు కొంత వరకు లాభం చేకూరే అవకాశం ఉంది.


ఆయిల్‌పామ్ తోట


ఎగుమతికి సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ గెలలు

కొత్త రకాలు

కొత్త రకాలు మార్కెట్లోకి వస్తున్నాయి. ప్రస్తుతం మలేషియాకు చెందిన కొత్త హైబ్రిడ్ రకం ఎ1 మార్కెట్లోకి వచ్చింది. ఈ మొక్క ధర రూ.26. మామూలు మొక్కను రూ.11 విక్రయిస్తుండగా రాయితీపై అంతకన్నా తక్కువ ధరతో కొత్త రకం హైబ్రిడ్ మొక్కను అందిస్తున్నారు. మామూలు మొక్క సీజను 6 నెలలు మాత్రమే ఉండగా హైబ్రిడ్ రకం మొక్క సీజను 8 నెలల పాటు ఉంటుంది. మామూలు మొక్కతో హెక్టారుకు 8 టన్నుల దిగుబడి వస్తుండగా కొత్త రకం మొక్కతో హెక్టారుకు 12 టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. దిగుబడి పెరగడంతో కొత్త రకం మొక్క అధికాదాయాన్ని ఇస్తుందని చెబుతున్నారు. ఇవి కాకుండా ఉద్యానవన శాఖ ద్వారా పలు రాయితీలు అందిస్తున్నారు. ఒడిదొడుకులను తట్టుకుని సాగులో ముందుకెళితే లాభాలు వాటంతట అవే వస్తాయని అధికారులు చెబుతున్నారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యానవనశాఖ అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. మద్దతు ధర పతనమైనా కంపెనీలు, ప్రభుత్వం అదనపు ధర చెల్లించి ప్రోత్సాహం ఇస్తున్నాయి. మొక్క నాటిన నాటి నుంచి ఫలసాయం అందొచ్చే వరకు అనేక రాయితీలు ఇస్తున్నారు.

– ఉమా మహేశ్వరి, ఉద్యానవనశాఖాధికారి

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట: రాష్ట్రంలో సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో మూడవ రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ సంక్షేమంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నట్టు చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలోని లేని విధంగా 35 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భూముల రీసర్వే చేపట్టి భూసమస్యలు పరిష్కరించినట్టు చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకూ అందరికీ పథకాలు అంజేస్తున్నట్టు చెప్పారు. పేద ప్రజలు వైద్యం కోసం మండలంలో పలు చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయన్నారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు ఆరా తీశారు. సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి,సర్పంచ్‌లు సకిలేటి రాము, పన్నీరు బాబ్జి, మేడిశెట్టి రామగోవిందు, ఎంపీటీసీలు తమ్మిర్సి సత్యనారాయణ, యగదాసు శేఖర్, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, మాజీ సర్పంచ్ తమ్మిర్సి గంగరావు,సీనియర్ నాయకులు జగతా శ్రీను, గూటూరు వెంకటేశ్వరరావు, ఏవోపీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపలో సంతోషం

ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు


లోవపాలెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో గడపగడపలో సంతోషం వెల్లివిరిస్తోందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. జెడ్.చింతువా సచివాలయం పరిధిలో గల లోవపాలెంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా క్రమం తప్పకుండా అన్ని పథకాలకు సీఎం సొమ్ము విడుదల చేస్తున్నారని తెలిపారు. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. గ్రామంలో ఇళ్లు నిర్మించుకునేవారు ముందుకొస్తే వారికి ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ), ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.ఎస్.ఎన్. రాజు(బుజ్జి), ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు, తహసీల్దార్ పి.భాగ్యవతి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ రథ సారథులు వలంటీర్లు


పురుషోత్తపురంలో వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ గోవింద్, వైస్ ఎంపీపీ శేషు

యలమంచిలి: సంక్షేమ రథసారథులు వలంటీర్లేనని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. మండలంలోని పురుషోత్తపురం,పులపర్తి గ్రామ సచివాలయాల్లో శుక్రవారం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. మెడల్స్ అందజేసి, దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలన్నీ ప్రజల వద్దకు చేర్చి వలంటీర్లు సంక్షేమ వారధులుగా నిలుస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త రాము మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజాన శేషు, పురుషోత్తపురం సర్పంచ్ రాజాన సునీత, పులపర్తి సర్పంచ్ సుంకర కొండబాబు,కొత్తలి సర్పంచ్ రాజుబాబు,పులపర్తి ఎంపీటీసీ నూకేశ్వరావు,కంటే శ్రీను ఎంపీడీవో దేవీప్రసాద్, ఈవోఆర్డీ దీపిక,సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, వైస్ ఎంపీపీ దేవి

వలంటీర్లకు సత్కారం

మునగపాక: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. మండలంలోని నాగులాపల్లి సచివాలయంలో శుక్రవారం వలంటీర్లను సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయని తెలిపారు. సర్పంచ్ జామి చినమ్మలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిందాడ దేవి, ఎంపీటీసీ మళ్ల కాశీసురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు,ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు,వైఎస్సార్‌సీపీ నేతలు పెంటకోట జ్యోతి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మూలజంపలో వలంటీర్ల సత్కరించిన సర్పంచ్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ అల్లవరపు బాబ్జి

వలంటీర్ల సేవలు అభినందనీయం

రాంబిల్లి : వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని మూలజంప సర్పంచ్ వేగి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు అల్లవరపు నాగేశ్వరరావు(బాబ్జి) అన్నారు.

మూలజంప గ్రామంలో శుక్రవారం వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లు సాయంతో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.లీల, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శివ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాలో శిక్షణ


విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న శ్రీనివాసరాజు

పాయకరావుపేట: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా యోగా గురువు ఎ.శ్రీనివాసరాజు స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు, విశ్రాంత ఉపాధ్యాయులు విద్యార్థులకు భగవద్గీత, భారతం, రామాయణంలలో శ్లోకాలు నేర్పిస్తున్నారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నారు.


కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు

కోటవురట్ల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక గ్రంథాలయాధికారి అప్పలనాయుడు తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో యోగ ఆసనాలు వేయించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనంతో పాటు నీతి కథలు చెప్పించారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

కోటవురట్ల: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు తహసీల్దారు జానకమ్మకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం వరాహనదిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ఎడ్ల బళ్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నప్పటికీ ఇప్పటి వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కైలాసపట్నం రెవెన్యూ పరిధిలో ఇసుక అక్రమ రవాణా నిత్యం జరుగుతోందని తెలిపారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

కోటవురట్ల: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. పి.కె.పల్లి గ్రామంలోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి స్టాక్ తనిఖీ చేశారు. ఫిర్యాదులు లేకుండా కేంద్రాలను నడపాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. సంపూర్ణ పోషణను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

రాంబిల్లి: పుస్తక పఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని దిమిలి లైబ్రేరియన్ ఎస్.శకుంతల అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఇక్కడి గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక, పఠనం, డ్యాన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదవడం, రాయడం బాగా నేర్చుకోవాలని తెలిపారు.

క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు

అనకాపల్లి రూరల్: ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 18 మంది క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు.టీబీని పూర్తిగా నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ ప్రకారం టీబీ రోగుల్లో రోగ నిరోధకశక్తి పెరగడానికి పౌష్టికాహార కిట్లు అందజేస్తున్నట్టు డీఎల్ఏటీవో శారదాబాయి చెప్పారు.క్షయ రోగులంతా క్రమం తప్పకుండా ఔషధాలు,పోషకాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు.పోలియో వలే టీబీని పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ వైద్య ఆరోగ్యశాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి బి.మంజూష, ఎంపీహెచ్ఈవో జమ్ము శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్‌లు బి.సంగం,ఎం.మాణిక్యాంబిక, ఎస్‌టీఎల్ ఎం.పెంటయ్య,బి.సత్యసుధ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


క్షయ రోగులకు కిట్లు అందజేస్తున్న డీఎల్ఏటీవో శారదాబాయి

'డైట్' విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లిటౌన్: ప్రకృతి నుంచి లభించే గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరాన్ని స్థానిక 'డైట్' కళాశాలడిప్లమో తృతీయ సంవత్సరం విద్యార్థులు తయారు చేశారు. ఆ పరికరాన్ని తయారు చేసిన విద్యార్థులు జి.సాయి, ప్రియ, కె.చందులను కళాశాల ప్రిన్సిపాల్ నరసింహం శుక్రవారం అభినందించారు. ఈ పరికరం ద్వారా ఎలా విద్యుత్‌ఉత్పత్తి చేయవచ్చో విద్యార్థులు విశదీకరించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను అన్నారు. మండలంలో జాతీయ రహదారి ఎంఎంఏఎల్ జంక్షన్ వద్ద 150 మంది ద్విచక్ర వాహనదారులకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్సు ఉన్న పిల్లలకు మాత్రమే వాహనాలు ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు.పెండింగ్‌లో ఉన్న ఈచలనాలు తక్షణమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్, వాహనదారులు పాల్గొన్నారు.

వాడీవేడిగా అచ్యుతాపురం మండల సమావేశం

- సమస్యలపై గళమెత్తిన సభ్యులు
- అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం


అచ్యుతాపురం మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోన సంధ్య

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమవుతున్నారంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కోన సంధ్య అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశంలో నిర్వహించిన మండల సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు మాట్లాడుతూ అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి పనులను వేగంగా ప్రారంభించాలని, కాంట్రాక్టర్ అనాసక్తిగా ఉంటే ఆయన్ని తప్పించి వేరే కాంట్రాక్టర్‌కు అప్పగించాలని కోరారు. సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దుప్పుతూరు సర్పంచ్ దేశంశెట్టి శంకర్‌రావు మాట్లాడుతూ బిల్లులు అందడం లేదని, ఇలాగైతే పనులెలా చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు.మంచి నీటి సరఫరా విభాగం అధికారులు సరిగ్గా పనిచేయడం లేదని మడుతూరు ఎంపీటీసీ జువ్వాల నాయుడు ధ్వజమెత్తారు. సమగ్ర సర్వేతో పాటు, రైతుల వద్ద బియ్యం కొనుగోలుకు సంబంధించి అంశాలపై మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు ప్రస్తావించారు. విద్యుత్ సమస్యలపై దొప్పెర్ల సర్పంచ్ చిన్నారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పరిధిని పరవాడ నుంచి తప్పించి అచ్యుతాపురంలో కలపాలని, లేకుంటే సంబంధిత అధికారి వచ్చి వివరణ ఇవ్వాలని కోరారు.పైపులైన్‌లో కోసం రోడ్డు మధ్యలో తవ్విన గోతులను ఎప్పుడు పూడుస్తారని పూడిమడక ఎంపీటీసీ చేపల శ్రీరాములు ప్రశ్నించారు.పూడిమడక పరిధిలోని వీఆర్‌వోల పోస్టులను భర్తీ చేయాలని సర్పంచ్ చేపల సుహాసిని కోరారు. ప్రైవేట్ లే అవుట్‌లో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంలో వ్యాపారం చేయడం ఎంత వరకూ కరెక్ట్ అని ఆవసోమవరం ఎంపీటీసీ బాబూరావు ప్రశ్నించారు. దీనికి గానూ ఆయా శాఖల అధికారులకు సమాధానం ఇచ్చినప్పటికీ ఆ సందర్భంలో కొద్ది పాటి వివాదం జరిగింది. కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బురదమయంగా సర్వసిద్ధి పీహెచ్‌సీ ప్రాంగణం

రోడ్డు నిర్మించాలని స్థానికుల డిమాండ్


పీహెచ్‌సీ నూతన భవనం ముందు నిలిచిన వర్షం నీరు

ఎస్.రాయవరం: చిన్నపాటి వర్షానికే కొత్తగా నిర్మించిన సర్వసిద్ధి పీహెచ్‌సీ భవన ప్రాంగణం చిత్తడిగా మారుతోంది. నూతనంగా నిర్మించిన ఈ భవనానికిరోడ్డు వేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి భవనం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్మించలేదు. దీంతో ఏ మాత్రం వర్షం కురిసినా భవనం ముందుభాగం బురదమయంగా మారుతోంది. ఈ భవన నిర్మాణానికి రాష్ట్రం ప్రభుత్వం నాడు-నేడు పనుల్లో సుమా రు రూ.కోటి కేటాయించింది. ఆధునిక హంగులతో నిర్మాణం పూర్తి చేశారు.ఈ నిర్మాణదశలోనే రోడ్డు కూడా వేయాల్సి ఉంది.రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వైద్యాధికారులు భవనం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం కురిసిన వర్షానికి భవనం ప్రాంతంలో వర్షపు నీరు చేరి బురదమయంగా మారింది. గమనించిన స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. భవనం ప్రారంభానికి ముందే రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జేఈ సత్యవాణిని వివరణ కోరగా భవనం నిర్మాణ క్రమంలో రోడ్డు వేయాల్సి ఉందన్నారు. అయితే భవనానికి కేటాయించిన నిధులు సరిపోలేదని చెబుతున్నారని, ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసి రోడ్డు నిర్మాణం చేస్తామని చెప్పారు.